
మిథునను హటాత్తుగా చూసి నమ్మలేకపోయాను. మరికాస్త నిదానంగా చూసేసరికి ఆమేనని నిర్ధారణకు వచ్చాను. పిలుద్దామని రెండడుగులు ముందుకేసే లోగా మరో వ్యక్తితో ఆటో ఎక్కి వెళ్ళిపోయింది.

ఆమెను కలిసే అవకాశం క్షణంలో తప్పినందుకు చివుక్కుమన్పించినా చానాళ్ళకు కనిపించినందుకు చాలా హాయి అనిపించింది.

# కనువిప్పు

## -సదాశివుని ఆనందరావు



మా కాలేజి డేస్‌లో కూడా అంతే...! ఆమెతో మాట్లాడినంత సేపు చాలా రిలాక్స్‌డ్‌గా వుండేది. కాలేజీలో అందరితో కలుపుగోలుగా, ఎంతో జోవియల్‌గా వుండేదామె. ఆమెతో స్నేహం చేయడమంటే గొప్పగా భావించేవారు. ఆ పర్యవసానమే మిథునతో ఏర్పడిన పరిచయం. క్రమేణా మా స్నేహంలో క్లోజ్‌నెస్ ఎక్కువవ్వడంతో ఏదో నెపంతో ఏకాంతంగా మాటాడుకోవడానికి ప్రయత్నించేవాళ్ళం. లీజర్ పీరియడ్ దొరికితే చాలు ఎక్కడో ఓ చోట సిట్టింగ్ వేసేవాళ్ళం.

అది మొదలుకొని మా స్నేహం కాలేజీలో పెద్ద టాపిక్ అయింది. స్టుడెంట్స్ గుసగుసలు మొదలుకొని గుడ్‌లక్స్ చెప్పేదాకా వచ్చారు. అయితే మాలోగల నిశ్చల స్వభావాన్ని మాత్రం ఎవ్వరూ కదల్చలేకపోయారు.

గోడమీద రాతలు చూసి మౌనంగా చెరిపించడం...కుర్రాళ్ళ కామెంట్స్‌కు నాజూగ్గా మందలించడం తప్ప విషయాన్నెప్పుడూ సీరియస్‌గా తీసుక లేదు. అయితే మిథున ఆలోచనలో వేరే ఏముం నా ముందెప్పుడూ ప్రస్తావించలేదు.

రెండవ ఏట చివరి పరీక్ష పూర్తయిం ఇద్దరం అలా బీచివైపు దారితీసి ఇసుక లపై కూర్చున్నాం.

"మోహన్! మరో ఏడాదిలో మన డిగ్రీ తుంది." మౌనాన్ని ఛేద్చింది మిథున.

"తెలిసిందేగా"....అన్నాను.

"కాని... ఈ ఒక్క ఏడాదిలో నాబోటి ఆడపిల్లల విషయంలో పేరెంట్స్ ఒక నిర్ణయానికొస్తారు..." అంది.

"అంటే! నీ విషయం కూడానా"...? అడిగాను.

"మరి, నేనూ ఆడపిల్లనేగా..! అయినప్పటికీ నా అభిప్రాయం నాకుంది."

తన మనసు పరోక్షంగా తెలియజేసినట్టనిపించడంతో "అమ్మాయిలలో నీవొక అదృష్టజాతకురాలవు" కేజువల్‌గా కామెంట్ చేశాను.

నామాటలామెను నిరాశపరిచాయేమో "కాలేజీలో మనకోసం చాలా ఊహించుకుంటున్నారు. దీనికోసం నీవెప్పుడన్నా ఆలోచించలేదా.."? ప్రశ్న సూటిగా వచ్చింది.

"నాకేమనిపించలేదు. కాకపోతే, వాళ్ళు చెప్పే పరిభాష మాత్రం డిఫరెంట్"...! అన్నాను.

నా సమాధానం ఆమెకు మరింత కష్టం కలిగించిందేమో బయల్దేరదామంటూ లేచింది.

అది జరిగిన నెల దినాలకు మిథున పెండ్లి కూతురు రూపంలో కనిపించింది. ఆ తరువాత చూడడమంటూ మరి జరగలేదు. మళ్ళీ ఇదే కనిపించడం... అందుకే కుశలం తెలుసుకోవాలన్న ఆసక్తి ఎక్కువై ఆమెను కలవాలన్పించింది.

** ** ** **

నన్ను చూసి నవ్వుతూ పలుకరించింది మిథున.

"కాస్త ముందొచ్చుంటే బాగుండేది. మా వారితో పరిచయమయ్యేది" అంది.

ఒక సంతృప్తి పవనం విడుస్తూ "థేంక్ గాడ్.!" అనుకున్నాను మనసులో...

కూర్చున్నంత సేపు ఏవేవో చెప్పింది కాని నాకేమీ తలకెక్కలేదు. ఆమెను తదేకంగా చూస్తూ ఆ మాట తీరు, అందమైన నవ్వు, శారీరక మార్పులు గమనిస్తూ కూర్చున్నాను.

క్రితం కంటే మిథున చాలా అందంగా వుందనిపించింది. కాఫీ కప్పు అందుకుంటూ "మిథునా.. నన్నెప్పుడైనా తల్చుకుంటావా?" అని అడిగాను.

నా ప్రశ్నకు సమాధానంగా ఒక చిరునవ్వు రువ్వి లోనకెళ్ళింది.రెండు నిమిషాల్లో తిరిగొచ్చి నా చేతిలో ఓ కాగితపు మడత పెట్టి "ఇంటికి వెళ్ళి చదువుకో...!" అంది.

ఆమెతో చెప్పి బయటపడ్డంతోనే ఆతృతగా కాగితాన్ని విప్పాను.

"మోహన్..ఇంకెప్పుడూ నన్ను కలవడానికి ప్రయత్నించకు... కారణం నాకు పెండ్లి కుదిరినప్పుడు కంగ్రాట్స్ చెప్పావు. నా శుభలేఖ ఇచ్చినప్పుడు థ్యాంక్స్ చెప్పావు. నీవు గాని అలా చేయకుండా వుండుంటే నా భర్త స్థానంలో నీవే వుండేవాడివి. ఇక ఒకరి ఆలోచనలతో మరొకరికి పని లేదు.. గుడ్ బై..!"

-మిథున.

అక్షరాలకు తల తిరిగినా కళ్ళు తెరిచినట్టయుంది. అవిచక్షణతో నేను కోల్పోయిందేమిటో అర్థమయింది. ●